జిల్లాలో అత్యధికంగా

భూ కబ్జాలు

- ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లూ ఇక్కడే ఎక్కువ
- డిప్యూటీ కలెక్టర్లతో క్షేత్రస్థాయి పరిశీలన చేయిస్తాం
- కన్వెన్షన్ సెంటర్లు, హోటళ్లు, రిసార్టులకు భూములిస్తాం
- పులికాట్ పూడికతీతపై ప్రత్యేక దృష్టి
- మీడియాతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్



సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి

తిరుపతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా భూకబ్జాలు విపరీతంగా జరిగాయి. ఇందులో తిరుపతి జిల్లాలో అత్యధికంగా భూములను ఆక్రమించారు. వీటిపై ప్రస్తుతం అధ్యయనం చేస్తున్నాం' అని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా మంగళవారం ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. అనంతరం కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో నిషేధిత జాబితా నుంచీ ఎక్కువగా భూములు తొలగించి ఫ్రీహోల్డులో ఉంచారని, వాటిలో చాలావరకూ రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయని గుర్తించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచీ భూములను తొలగించిన చోట్ల, రిజిస్ట్రేషన్లు జరిగిన చోట్ల క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారన్నారు. దీనికోసం ప్రత్యేకంగా డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను నియమిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఏడుగురు ఆ స్థాయి అధికారులు సర్వే చేస్తున్నారని వివరించారు. నవంబరు 15వ తేదీ నాటికి మొత్తం పరిశీలన పూర్తి చేసి ప్రభుత్వానికి స్టేటస్ రిపోర్టు అందజేస్తారని మంత్రి వివరించారు. ఇక, శ్రీవారు కొలువైన తిరుపతి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా.. అభివృద్ధిలో భాగస్వామినైనందుకు గర్విస్తున్నానని మంత్రి సత్యప్రసాద్ అన్నారు. రోజుకు లక్ష మందికిపైగా యాత్రికులు రాకపోకలు సాగించే తిరుపతిని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఆతిథ్య రంగంలో కన్వెన్షన్ సెంటర్లు, హోటళ్లు, రిసార్టుల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి అవసరమైన భూములు కేటాయిస్తామన్నారు. పులికాట్ సరస్సు ఆక్రమణలకు గురైందని, సముద్ర ముఖద్వారాలు పూడిపోవడంతో నీటి నిల్వ తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పూడికతీత, ఆక్రమణల తొలగింపునకు సంబంధించి కలెక్టర్ ప్రతిపాదనలు రూపొందించారని, వాటిపై ప్రభుత్వం తగిన విధంగా నిర్ణయం తీసుకుంటుందన్నారు.

గంజాయి, డ్రగ్స్‌పై ఆందోళన

గత ప్రభుత్వ తప్పిదాలు, నిర్లక్ష్యం వల్ల తిరుపతి ప్రాంతంలో గంజాయి, డ్రగ్స్ వాడకం పెరుగుతోందని మంత్రి అనగాని ఆందోళన వ్యక్తంచేశారు. గత ఐదేళ్లలో వీటికి బానిసలుగా మారిన వారిని మంచి దారిలో నడిపించే ప్రయత్నం తమ కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. తిరుపతి పరిసరాల్లో జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థలు అధికంగా ఉండటం కూడా డ్రగ్స్ వినియోగం పెరగడానికి కారణం కావచ్చని అభిప్రాయపడ్డారు. జిల్లా పోలీసు యంత్రాంగం ద్వారా ఆయాచోట్ల విద్యార్థులను చైతన్యపరిచేందుకు, మార్పు తీసుకు రావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. హామీల అమలు గురించి వివరించారు. సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సాల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, డీఆర్వో పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై ప్రతి నెలా సమీక్ష

జిల్లా అభివృద్ధికి సంబంధించి ప్రతి నెలా అధికార యంత్రాంగంతో సమీక్షిస్తామని మంత్రి సత్యప్రసాద్ వెల్లడించారు. అభివృద్ధిపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ చేసిన కొన్ని సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. తమది ప్రో యాక్టివ్ ప్రభుత్వమని ప్రజలకు మేలు చేసే నిర్ణయాలతో ముందుకు వెళతామన్నారు. ఇసుకపై ప్రజల్లో అపోహలు ఉన్నాయని అభిప్రాయపడిన మంత్రి.. ఇసుకను ప్రజలకు ఉచితంగా ఇస్తామన్నారు. సీనరేజీ విధిస్తే దానిపై జీఎస్టీ కూడా తోడై పేదలపై భారం పడుతుందన్నారు. అందుకే పేదలు, ప్రజల అవసరాలకు వీలుగా ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై ఇసుక తరలింపునకు సీనరేజీని సీఎం చంద్రబాబు తొలగించారన్నారు. ఇసుక అక్రమ రవాణాను, పక్క రాష్ట్రాలకు తరలించడాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. సత్యవేడు నియోజకవర్గం తమిళనాడు సరిహద్దుల్లో.. చెన్నైకి చేరువగా ఉండటం వంటి కారణాలతో ఇసుక స్మగ్లింగ్ జరగకుండా కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.



జిల్లా ఓటర్లు

18,10,846 మంది

ముసాయిదా జాబితా విడుదల

మే నాటితో పోలిస్తే తగ్గిన ఓటర్లు 2,134

ఓటర్ల నమోదుకు వచ్చే నెల 28 వరకు గడువు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్ల ముసాయిదా జాబితాను కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం రాత్రి విడుదల చేశారు. ముసాయిదా జాబితా ప్రకారం 18,10,846 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఆగస్టు 20 నుంచి ఓటర్ల సవరణ ప్రక్రియ ప్రారంభించారు. అలాగే కొత్త ఓటరుగా నమోదుకూ ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. కాగా, జిల్లాలో ముఖ్యంగా చంద్రగిరి, తిరుపతిలో అత్యధింగా బోగస్ ఓట్లు ఉన్నాయని కూటమి నేతలు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. గత రెండు నెలలుగా బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల సమాచారాన్ని సేకరించారు. చాలాచోట్ల పొరబాట్లను గుర్తించారు. కాగా, సార్వత్రిక ఎన్నికల సమయంలో మే 8 నాటి ఓటర్ల తుది జాబితాలో 18,21,980 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుత ముసాయిదా జాబితా ప్రకారం 18,19,846 మంది (సర్వీసు ఓటర్లు మినహాయించి) ఉన్నారు. ఈ లెక్కన జిల్లాలో 2,134 మంది ఓటర్లు తగ్గారు. ఇక, ప్రతి నియోజకవర్గంలోనూ మహిళా ఓటర్లే అధికం. మొత్తం ఓటర్లలో పురుషులు 8,82,129 మంది ఉంటే, మహిళల సంఖ్య 9,28,543. అంటే 46,414 మంది మహిళలు అధికంగా ఉన్నారు. మృతులు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓట్లను తొలగించి, కొత్తవి నమోదు చేసుకున్నారు. ఇక, పోలింగ్‌కేంద్రాల సంఖ్య 2,141 చేరింది. వచ్చే సంవత్సరం జనవరి నాటికి 18 ఏళ్ల ప్రతి ఒక్కరూ నవంబరు 28లోపు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. అభ్యంతరాలూ తెలియజేయవచ్చు. యువతలో ఓటు ఓటు హక్కు నమోదుపై అవగాహన పెంచడానికి రెండవ శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ఆ రోజుల్లో బీఎల్‌వోలు ప్రతి కేంద్రంలో అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరిస్తారు. తుది ఓటర్ల జాబితా వచ్చే జనవరి 6న ప్రకటిస్తారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
గూడూరు	1,18,828	1,25,807	34	2,44,669
సూళ్ళూరుపేట	1,17,923	1,24,357	20	2,42,300
వెంకటగిరి	1,18,961	1,24,769	4	2,43,734
చంద్రగిరి	1,52,872	1,61,970	59	3,14,901
తిరుపతి	1,49,854	1,52,644	33	3,02,531
శ్రీకాళహస్తి	1,19,598	1,28251	13	2,47,862
సత్యవేడు	1,04,093	1,10,745	11	2,14,849
మొత్తం	8,82,129	9,28,543	174	18,10,846

అభివృద్ధిలో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం

- ఇన్‌చార్జి మంత్రి అనగాని పిలుపు
- సమీక్షల్లో అధికారులకంటే కూటమి నేతలే ఎక్కువ

చంద్రబాబు దార్శనిక పాలనలో జిల్లాను అభివృద్ధిపరంగా అగ్రస్థానంలో నిలుపుదామని అధికారులకు ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సమీక్ష జరిపారు. సుదీర్ఘంగా నిర్వహించిన ఈ సమావేశంలో కీలక శాఖలకు సంబంధించి లోతుగా ఆరా తీశారు. ఈ సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సాల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, డీఆర్వో పెంచల కిశోర్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీవోలు, అన్ని శాఖల జిల్లా అధికారులతో పాటు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు (తిరుపతి), పులివర్తి నానీ (చంద్రగిరి), బొజ్జల సుధీర్‌రెడ్డి (శ్రీకాళహస్తి), పాశిం సునీల్ కుమార్ (గూడూరు), కురుగొండ్ల రామకృష్ణ (వెంకటగిరి), ఎమ్మెల్సీ శ్రీకాంత్ సమావేశానికి హాజరయ్యారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, సూళ్లూరుపేట, సత్యవేడు ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, కోనేటి ఆదిమూలం హాజరు కాలేదు. ఈ సంగతి పక్కన పెడితే సమావేశంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు కమిటీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు కూడా మంత్రి అధికారిక సమీక్షా సమావేశం ఆద్యంతం పాల్గొన్నారు. వీరితో పాటు ద్వితీయ శ్రేణి నాయకులు పెద్ద సంఖ్యలో సమావేశం హాలులోకి చేరుకున్నారు. కుర్చీలు సరిపోక చాలా మంది నిలబడ్డారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల కంటే కూటమి పార్టీల నేతలు, ఛోటా నాయకులు, వారి అనుచరులే ఎక్కువమంది కనిపించారు. వీరిని సమావేశంలో ఉండనివ్వాలా లేదా పంపేయాలా అన్నది తేల్చుకోలేక ఉన్నతాధికారులు సతమతమయ్యారు. ఏ నిర్ణయం తీసుకుంటే ఎలా ఉంటుందో.. అందునా మంత్రి తొలి సమీక్ష కావడంతో ఆయన ఎలా ప్రతిస్పందిస్తారో అధికారులు అంచనాకు రాలేకపోయారు. ఇలా అధికారిక పదవులూ లేకపోయినా సమావేశంలో పాల్గొనడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

ముక్కంటి ఆలయ ఈవోగా బాపిరెడ్డి



శ్రీకాళహస్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా టి.బాపిరెడ్డిని నియమిస్తూ దేవదాయ శాఖ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి ఆర్‌జేసీగా ఉన్న చంద్రశేఖర్ ఆజాద్ ముక్కంటి ఆలయ ఇన్‌ఛార్జి ఈవోగా వ్యవహరించారు. ఈ క్రమంలో రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న బాపిరెడ్డిని ఈవోగా బదిలీ చేస్తూ ఆదేశాల్లో పేర్కొన్నారు.

తిరుపతిలో బాలికా సంప్రదాయ పాఠశాల

- టీటీడీ భూ కేటాయింపునకు ప్రభుత్వ ఆమోదం

తిరుమల, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): బాలికల కోసం తిరుపతిలో ఏర్పాటు చేయనున్న సంప్రదాయ పాఠశాలకు టీటీడీ భూమిని లీజుకు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కంచికామకోటి పీఠం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే ఈ పాఠశాలకు అలిపిరి జూపార్క్ రోడ్డులో టీటీడీకి చెందిన ఐదెకరాలను కంచి పీఠం కోరింది. గతేడాది నవంబరులో జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో ఎకరాకి ఏడాదికి రూ.వెయ్యి చొప్పున 33 ఏళ్ల పాటు లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ తీర్మానించింది. ఆమోదం కోసం ప్రభుత్వానికి టీటీడీ లేఖ పంపింది. ఈ తీర్మానాన్ని ఆమోదిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ పాఠశాలలో విష్ణు.. లలిత సహస్రనామాలు, మంత్రాలు, అష్టోత్తర శతనామావళి తదితరాలపై తరగతులు నిర్వహించనున్నారు.

ఉచిత సిలిండర్ల బుకింగ్ ప్రారంభం

- తొలిరోజు 30 వేలకుపైనే
- గురువారం నుంచి సిలిండర్ల డెలివరీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌కు తొలిరోజైన మంగళవారం అనూహ్యమైన స్పందన లభించింది. తిరుపతి నగరంలో సాధారణ రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా బుక్ అయ్యే సిలిండర్ల కంటే బుధవారం 25 నుంచి 30 శాతం అదనంగా బుక్ చేశారని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు చెప్పారు. నగరంలో అన్ని కంపెనీల గ్యాస్ ఏజెన్సీలు దాదాపు 13 వరకున్నాయి. కాగా, తమ వద్ద సాధారణ రోజుల్లో 350 నుంచి 400 సిలిండర్లు బుక్ అయ్యేవని.. మంగళవారం ఆన్‌లైన్ ద్వారా 610 బుక్ చేశారని శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ అధినేత నాదముని చెప్పారు. ఇలా ఒక్క తిరుపతిలోనే దాదాపు 6500 సిలిండర్లు బుక్ అయ్యాయి. జిల్లాలోని 62 ఏజెన్సీల్లో 30వేలకుపైగా బుక్ అయినట్లు అంచనా. ప్రస్తుతం బుక్ చేసిన ఉచిత సిలిండర్లను గురువారం నుంచి పంపిణీ చేయనున్నారు. కాగా, మూడింటిలో తొలి ఉచిత సిలిండర్ కోసం మంగళవారం నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేది వరకు బుక్ చేసుకోవచ్చు.

రేపు స్విమ్స్‌లో ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా స్విమ్స్ ఆస్పత్రిలో ఓపీ, ఓటీలకు గురువారం సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర వైద్య సేవలు మాత్రమే అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీలకు డస్ట్‌బిన్‌ల పంపిణీ



భాకరాపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణకు డస్ట్ బిన్‌లను పంపిణీ చేసినట్లు ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమ శేఖరరెడ్డి తెలిపారు. గత ఎన్నికలకు ముందు మండల కేంద్రానికి వచ్చిన డస్ట్ బిన్‌లను ఎన్నికల కోడ్ కారణంగా పంపిణీ చేయలేదన్నారు. ప్రస్తుతం మండలంలోని 13 పంచాయతీలకు 5700 డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశామన్నారు. తడి చెత్త-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడానికి ప్రతి ఇంటికీ రెండు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను తీసుకుని చెత్త సేకరణ కేంద్రాలకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రామ్మోహన, స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్ గిరిబాబు, పాల్గొన్నారు.

ఫీజు బకాయిల విడుదలకు ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా



చంద్రగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మంగళవారం చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా తేజ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఫీజు బకాయిలు రూ.3480 కోట్ల పెండింగ్ పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు పూర్తవుతున్నా బకాయిలను విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి, ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, తేజ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



దీపావళి సందర్భంగా తిరుపతి నగరంలో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రంలో టపాసులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

7న మిక్స్‌డ్ రైస్ టెండర్, వేలం

తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన బియ్యానికి టీటీడీ నవంబరు 7న టెండర్ ద్వారా వేలం నిర్వహించనుంది. ఇందులో మిక్స్‌డ్ బియ్యం 13,880 కేజీలు ఉంచనున్నారు. ఆసక్తిగలవారు 7వ తేదీలోపు 'కార్యనిర్వహణాధికారి, టీటీడీ' పేరుతో రూ.25 వేల ఈఎండీ, సీల్డ్ టెండర్‌తో పాటు తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం జనరల్ మేనేజర్ కార్యాలయంలో సమర్పించాలని టీటీడీ సూచించింది. అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు టెండర్లను ఓపెన్ చేయనున్నారు.

అమరవీరుల వారోత్సవాల్లో ఉచిత వైద్య శిబిరం



చంద్రగిరి, అక్టోబరు 29(ఆంధ్ర జ్యోతి): ఎ.రంగంపేట సమీపంలో కల్యాణీ డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో పోలీసుల అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా మంగళవారం రక్తదాన,ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈసందర్భంగా పీటీసీ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం డ్యామ్ పీటీసీలోని సిబ్బంది రక్తదానం చేశారు. ఉచిత వైద్య శిబిరంలో ఎ.రంగంపేట పంచాయతీలోని దుర్గం ఎస్టీకాలనీ, కృష్ణాపురం హరిజనవాడ, దర్శిపల్లి, ఎ.రంగంపేట గ్రామాల రోగులు సేవలు పొందారు. కార్యక్రమంలో పీటీసీలోని వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధికారులు, పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎమ్మెల్యేలు మాలకొండయ్య, నరేంద్రవర్మ, కురుగొండ్ల రామకృష్ణ, చంద్రశేఖర్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఏపీ బాలలహక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కూడా ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

11 నుంచి రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు

చంద్రగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తొండవాడలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో నవంబరు 11 నుంచి 20 వరకు రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి తెలిపారు.

బర్సీ మహోత్సవం

తిరుపతి రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం పంచాయతీ విద్యుత్‌నగర్‌లోని స్వామి హథీరామ్ బావాజీ ఆలయంలో బావాజీ బర్సీ మహోత్సవాన్ని మంగళవారం ప్రారంభించారు. సేవాలాల్ మహారాజ్ జన్మస్థలం సేవగడ్ నుంచి పలువురు బంజారా మహంతులు రమేష్ మహరాజ్, వసంత్ మహరాజ్, గణపతి మహరాజ్, రాజేంద్రగురు, ఎస్ఎన్ కృష్ణ నేతృత్వంలో బంజారా తండాల్లో అఖండ జ్యోతితో పర్యటించి తిరుపతి గాంధీరోడ్డులోని హథీరామ్ మఠాన్ని సందర్శించారు. బావాజీ ఆలయాన్ని సందర్శించి మహాభోగ్ బండారో హోమం, ప్రత్యేకపూజలను నిర్వహించారు.

2 నుంచి శివాలయాల్లో కార్తీక సందడి



తలకోన సిద్దేశ్వర స్వామి -తొండవాడలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం

ఎర్రావారిపాలెం ,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తలకోన సిద్దేశ్వర స్వామి కార్తీక మాసోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. నవంబరు 2 నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో దీపావళి తర్వాత వచ్చే అమావాస్యకు భక్తులు నోముల నోయనున్నారు. దీంతో తలకోన గుడి ప్రాంగణానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఎమ్మెల్యే పులివర్తి నాని ఇప్పటికే సమీక్ష నిర్వహించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ చైర్మన్ సోమశేఖర్‌రెడ్డిని, ఈఓ మమతలను ఆదేశించారు. 15న పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ మమత తెలిపారు. ●చంద్రగిరి: తొండవాడలోని శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో నవంబరు 2 నుంచి కార్తీక మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతి సోమవారం విశేష పూజలు నిర్వహించనున్నారు. 4న రుద్రాభిషేకం, 5న నాగుల చవితి, 11న విభూది అభిషేకం, 18న చందనాభిషేకం, 25న లక్షబిల్వార్చన జరుగుతుంది. డిసెంబరు 6న ఆనందవల్లి అమ్మవారికి కుంకుమార్చన చేయనున్నారు. 15న కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నారు.

డబుల్ ఇంజన్ ప్రభుత్వంలో వేగవంతంగా అభివృద్ధి



పార్టీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే పులివర్తినాని

తిరుచానూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో నియోజకర్గ అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. తన పల్లి సమీపంలోని రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే నానిని ఎంపీ మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా నిర్మిస్తున్న పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎంపీని నాని కోరారు. గత వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సహజ వనరుల ఆధారంగా పరిశ్రమలను ఏర్పాటు చేస్తే ఉపాధి కల్పించవచ్చునన్నారు. ఎంపీ సానుకూలంగా స్పందించారు.

మాజీమంత్రికి అనగాని పరామర్శ



మాజీమంత్రి పరసారత్నాన్ని పరామర్శిస్తున్న అనగాని సత్యప్రసాద్

తిరుచానూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మాజీమంత్రి పరసారత్నాన్ని మంగళవారం ఆయన నివాసంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పరామర్శించారు. ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీతిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఘనంగా ఆయుధపూజ

తిరుపతి రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ యశోద, వైస్‌ఎంపీపీ మాధవరెడ్డి, ఎంపీడీవో రామచంద్ర, ఏవో రంగనాథం, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'ను విజయవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్) అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవంబరు 2 నుంచి ప్రారంభించే ఉల్లాస్ (సమాజంలో అందరికీ జీవితకాల అభ్యసన అవగాహన) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తిరుపతి టీటీడీసీలో ఉల్లాస్‌పై ఎంపీడీవోలు, సెర్ప్ ఏపీఎంలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ 2030 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి ప్రసాద్, డీపీఎం విజయ పాల్గొన్నారు.

డీఈవోకు అభినందనలు

తిరుపతి విద్య, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): డీఈవో కేవీఎన్ కుమార్‌కు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 నాయకులు అభినందనలు తెలియజేశారు. డీఈవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సంఘం నాయకులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువలతో సన్మానించారు. సంఘం రమేష్, సురేష్, నరేంద్ర, జితేంద్రబాబు, దేవానంద్, శ్రీనివాసులు, కేశవరెడ్డి, మునిరామిరెడ్డి, గణేష్, రామాంజులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ బుకింగ్ ప్రారంభం

భాకరాపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ప్రారంభించినట్లు తహసీల్దారు జనార్దన్‌రాజు తెలిపారు. ఆధార్ నంబరు, రేషన్ కార్డు ఆధార్‌తో లింక్ అయిన బ్యాంకు ఖాతా, గ్యాస్ కనెక్షన్ లబ్దిదారుల జాబితా గ్యాస్ ఏజెన్సీల వద్ద ఉందన్నారు. లబ్దిదారులు బుక్ చేసి గ్యాస్ ధర చెల్లించాలన్నారు. మెసేజ్ వచ్చిన వారికి వారు చెల్లించిన మొత్తం 48 గంటల్లో బ్యాంకు ఖాతాకు జమవుతుందన్నారు. ●ఎర్రావారిపాలెం: మండలంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం వినియోగించుకోవాలని సాయి సూర్య గ్రామీణ విత్రక్ ఇండేన్ గ్యాస్ నిర్వాహకురాలు చింతపర్తి వనజ కోరారు. అర్హులైనవారు 84549 55555 ఫోన్ నంబరు ద్వారా ఆన్‌లైన్‌లో సిలిండర్ బుక్ చేసుకోవాలన్నారు. తమ ఏజెన్సీ వద్ద గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు కేవైసీ చేయించుకోవాలన్నారు. ●రామచంద్రాపురం: అర్హులైన లబ్ధిదారులు ఉచిత గ్యాస్‌సిలిండర్ కోసం ఈ నెల 31లోపు గ్యాస్ ఏజెన్సీలో నమోదు చేసుకోవాలని సివిల్ సప్లైస్ డీటీ యుగంధర్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు.

సంస్కృత వర్సిటీలో . ధన్వంతరి జయంతి

తిరుపతిరూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృతవర్సిటీలో మంగళవారం ధన్వంతరి జయంతిఘనంగా నిర్వహించారు. ధన్వంతరి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్‌శుక్లా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ, కోఆర్డినేటర్ డాక్టర్ బాలదత్తాత్రేయ, ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ ఎస్.లతా తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా సమన్వయ అభివృద్ధి కమిటీ సమావేశం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 29: తిరుపతి కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా సమన్వయ అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఉదయం 10.30గంటలకు ఈ సమావేశం ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో తిరుపతి ఎంపీ చైర్మన్‌గా, చిత్తూరు ఎంపీ కో చైర్మన్‌గా, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.

రిటైరైన అధ్యాపకుడికి సన్మానం

తిరుపతి(విద్య), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఇంగ్లీష్ విభాగాధిపతి పి.మోహన్‌మూర్తి పదవీ విరమణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనమూర్తి దంపతులను శాలువలు కప్పి సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి, భాస్కరుడు, సీఐటీయూ కందారపు మురళి, డాక్టర్ భీమన్న, పి.విజయ, పి.అన్నయ్య, రామకృష్ణరెడ్డి, మునీంద్ర పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్సు ఉద్యోగులతో ఎస్పీ దర్బార్



మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్

మంగళం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో మంగళవారం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యోగులతో దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఉద్యోగులతోపాటు టాస్క్‌ఫోర్సు సబ్ కంట్రోల్ కడప కార్యాలయం, సానిపాయ, రైల్వేకోడూరుసిబ్బంది జూమ్ ద్వారా హాజరయ్యారు. అటవీశాఖతో సమన్వయం చేసుకోవడంపై ఆయన కీలక సూచనలుచేశారు. డీఎస్పీ బాలిరెడ్డి, ఎస్‌సీఎఫ్‌శ్రీనివాస్, ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ ఎఫ్ఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 122మంది ఎంపిక



మాట్లాడుతున్న పాలడుగు విజయ

తిరుపతిరూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):భవానీనగర్ సర్కిల్‌లోని గేట్ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 122మంది పలు సంస్థల ఉద్యోగాలకు ఎంపికైనట్లు చైర్‌పర్సన్ పాలడుగు విజయ తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ, ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈమేళాకు వివిధ ప్రాంతాలనుంచి అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఎంపికైన వారికి ఆఫర్ లెటర్లని అందజేసి అభినందించారు. ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి లోకనాథం, గేట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి రఫీ పాల్గొన్నారు.

సాహిత్య రంగంలో సాంకేతిక వినియోగం పెరగాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సాహిత్య రంగంలో సాంకేతిక వినియోగం మరింతగా పెరగాలని జాతీయ సంస్కృత యూనివర్సిటీ రిజిస్ట్రార్ రమశ్రీ పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీ తెలుగు విభాగంలో మంగళవారం నిర్వహించిన సాహితీ సమితి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలుగు - ఆంగ్ల పరిశోధకులు సమన్వయంతో పరిశోధనలు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. యంత్రానువాదం ద్వారా అనువాదాన్ని వేగంగా పూర్తి చేయవచ్చన్నారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య మధుజ్యోతి మాట్లాడుతూ.. భాషా సాహిత్య రంగాల్లో కంప్యూటర్ వినియోగం పెరగడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. సాహితీ సమితి కన్వీనర్ డాక్టర్ సుభాషిణి, అధ్యాపకులు డ్వార్ డి.యువశ్రీ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



తిరుపతి(క్రీడలు), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి గ్రామీణ మండలంలోని మంగళం ట్రెండ్స్ పాఠశాల మైదానంలో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బేస్‌బాల్ అండర్ 14, 17 విభాగాల మధ్య పోటీలు నిర్వహించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి 208 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను (అండర్ 14, 17 విభాగాలకు 16మంది చొప్పున) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కేశవుల నాయుడు క్రీడాకారులను అభినందించారు. గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 9, 10, 11 తేదీల్లో మంగళం ట్రెండ్స్ పాఠశాలలో జరిగే అండర్ 14 విభాగం, గుంటూరు జిల్లా యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే అండర్ 17 విభాగం పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎస్.బాబు, కృష్ణ, నూరుద్దీన్, ఎస్.ఎస్.నాయుడు, సురేష్, జయశంకర్, రామకృష్ణ, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కోసం కష్టపడినవారికి తగిన ప్రాధాన్యత

సుగుణమ్మ నివాసంలో మంత్రి అనగాని



సుగుణమ్మ నివాసానికి వచ్చిన మంత్రిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో పార్టీకోసం పనిచేసినవారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని త్వరలోనే సీఎం చంద్రబాబు నామినేటెడ్ పదవులకు తగిన న్యాయం చేయబోతున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుపతి పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం సాయంత్రం సుగుణమ్మ నివాసంలో పార్టీ శ్రేణులతో కలసి అల్పాహారం స్వీకరించారు. పార్టీ నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సుగుణమ్మతో ఏకాంతంగా కొద్దిసేపు మాట్లాడారు. ఈసందర్భంగా మంత్రిని శ్రీవారి జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, నాయకులు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, బీఎల్ సంజయ్, బీవీ కీర్తి, శ్రీధర్ వర్మ, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, బుల్లెట్ రమణ, మన్నెం శ్రీనివాసులు, ఊట్ల సురేంద్ర నాయుడు, చినబాబు, కొట్టే హేమంత్ రాయల్, బ్యాంకు శాంతమ్మ, ఆముదాల తులసీరాం, రుద్రకోటి సదాశివం తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో మంగళవారం ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు తొలిరోజున హాకీ, చెస్, క్యారమ్, అథ్లెటిక్స్, షటిల్‌బ్యాడ్మింటన్, పవర్‌లిఫ్టింగ్, టెన్నిస్, టేబుల్‌టెన్నీస్, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు జరగ్గా, మహిళలు 22మంది, పురుషులు 44మంది పాల్గొన్నారు. బుధవారం మిగిలిన పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ తెలిపారు.

ఆక్రమిత దుకాణాన్ని వెంటనే సీజ్ చేయండి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రి ఆవరణలో ఆక్రమణకు గురైన దుకాణాన్ని వెంటనే సీజ్ చేసి ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రుయాస్పత్రిలో ఖాళీగా ఉన్న ఓ దుకాణాన్ని నెల రోజుల కిందట హెచ్‌డీఎస్ సభ్యుడు లక్ష్మీపతి అనుచరులు ఆక్రమించి అందులో వ్యాపారం సాగిస్తున్న విషయంపై ఆంధ్రజ్యోతిలో కలెక్టర్ ఆదేశించినా అదే తీరు శీర్షికన మంగళవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆయన తక్షణమే దుకాణాన్ని సీజ్ చేసి స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాల మేరకు ఆక్రమిత దుకాణాన్ని సీజ్ చేసి స్వాధీనం చేసుకుంటున్నటు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న దీపావళి స్నేహ సమ్మేళనం



స్టాళ్ల వద్ద తల్లిదండ్రులతో విద్యార్థుల సందడి

తిరుపతి గాంధీ రోడ్డు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ విద్యాభవన్స్ స్కూల్‌లో మంగళవారం దీపావళి స్నేహ సమ్మేళనం పేరిట నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. నోరూరించే వివిధ రకాల వంటకాలకు సంబంధించిన స్టాళ్లు, పుస్తక ప్రదర్శనశాల ఏర్పాటు చేశారు. అతిథులుగా హాజరైన ఐఐటీ ప్రొఫెసర్ అడ్లూరు రఘురామరాజు, టీటీడీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్పీ డీకేఎస్ రామచంద్రరాజులతో విద్యాభవన్స్ డైరెక్టర్ సత్యనారాయణరాజు కలసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి పలు స్టాళ్లని సందర్శించి సందడి చేశారు. వివిధ పోటీల్లో ప్రతిభచాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సంస్కృత వర్సిటీ స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జేబీ తండ్రికి మంత్రి నివాళి



తిరుపతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు జేబీ శ్రీనివాస్ తండ్రి కోటేశ్వరరావు చిత్రపటానికి మంత్రి అనగాని సత్యప్రసాద్ నివాళులు అర్పించారు. ఇటీవల అనారోగ్యంతో జేబీ తండ్రి మృతి చెందారు. ఈనేపథ్యంలో తిరుపతికి వచ్చిన మంత్రి అనగాని మంగళవారం జేబీ నివాసానికి వెళ్లి అయనను ఓదార్చారు.

భూమనను సన్మానించిన పెద్దిరెడ్డి



తిరుపతి (జీవకోన), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాల వైసీపీ అధ్యక్షుడిగా నియమితులైన టీటీడీ మాజీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించారు. పార్టీ పటిష్టత కోసం పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పెద్దిరెడ్డి చెప్పినట్లు కరుణాకరరెడ్డి తెలిపారు. అనంతరం పార్టీ వ్యవహారాలపై కాసేపు చర్చించుకున్నారు.

నామినేటెడ్ పదవుల్లో బలిజలకు సామాజిక న్యాయం కల్పించాలి



మాట్లాడుతున్న గ్రేటర్ రాయలసీమ బలిజ మహాసభ నాయకులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జనాభా నిష్పత్తి ప్రకారం బలిజలకు రాజకీయ అధికార వ్యవస్థలో నామినేటెడ్ పదవులు కేటాయించి సామాజిక న్యాయం కల్పించాలని గ్రేటర్ రాయలసీమ బలిజ మహాసభ కన్వీనర్ చెన్ను శివప్రసాద్ అన్నారు. స్థానిక ఒక హోటల్లో మంగళవారం మధ్యాహ్నం గ్రేటర్ రాయలసీమ బలిజ మహాసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బలిజ సామాజిక వర్గం దీర్ఘకాల డిమాండ్లు, నామినేటెడ్ పోస్టుల్లో జరగాల్సిన న్యాయం, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల కేటాయింపు వంటి అంశాలపై చర్చించారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ త్వరలోనే మూడు పార్టీల అధినేతలను కలసి తమ డిమాండ్లను పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. వై.వి.చక్రధర్, గూడంశెట్టి దొరబాబు, పొనగంటి భాస్కర్, కడియాల వరదరాజులు, జి.ఎస్.ప్రసాద్, డాక్టర్. పి.ఎస్.కరుణానిధి, కృష్ణయ్య, ఆరణి బాలాజీ, తులసీరాం, డి.ఎన్.గిరి, వి.కె.విశ్వనాథ్, కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో ఘనంగా ఆయుధపూజ

తిరుపతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థలో మంగళవారం సాయంత్రం ఆయుధపూజ ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొని అమ్మవారికి, నగరపాలక సంస్థ వాహనాలకు పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వాహనాలను జాగ్రత్తగా నడపాలని, ఆయురారోగ్యాలు కలిగి ఉండాలని అన్నారు.

పీఎం కిసాన్ సమ్మాన్‌ని సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు పేర్కొన్నారు. 17, 18వ విడతకుగాను జిల్లాలో 1,38,804మంది రైతులకు ఈ పథకం ద్వారా రూ.55కోట్ల 52లక్షలు బ్యాంకు ఖాతాలలో జమ అయిందని, ఇంకా 1310మంది రైతులకు జమ కావాల్సి ఉందని వివరించారు. డబ్బులు జమ కాని రైతులు బ్యాంకుకి వెళ్లి అకౌంట్ నంబరుకి ఆధార్‌ని లింక్ చేసుకోవాలని తెలిపారు. 244మంది రైతులు ఈకేవైసీ చేసుకోలేదని, వీరు కూడా రైతుసేవాకేంద్రాల్లో అధికారులను కలసి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని చెప్పారు.

టీటీడీ ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నికలు పూర్తి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగుల సహకార బ్యాంకు పాలక మండలి సభ్యులుగా ఏడుగురు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి ఉమాపతి మంగళవారం ప్రకటించారు. తిరుపతి గోవిందరాజస్వామి హైస్కూలులో సోమవారం పోలింగ్ అనంతరం ప్రారంభమైన కౌంటింగ్ మూడురౌండ్లుగా లెక్కించామని ఆయన తెలిపారు. చివరి రౌండ్ మంగళవారం ఉదయం 7 గంటలకు ముగిసిందన్నారు. మూడు రౌండ్ల కౌంటింగ్ ముగిసిన అనంతరం వరుసగా తలారి మహేష్‌కు 2423, అమ్మిటి మునివెంకట రెడ్డికి 2312, గంగరాజకుమార్‌కు 2246, చీర్ల కిరణ్‌కు 1889, ఎస్‌వి దొరైరాజుకు 1727, ఆర్.కిషోర్‌కుమార్‌కు 1503, తిమ్మోజిపల్లి హేమబిందు 1487 ఓట్లతో గెలుపొందారని ఆయన ప్రకటించారు. పోటీ చేసిన 35 మందిలో వీరికి అధిక ఓట్లు రావడంతో విజేతలుగా ప్రకటించమన్నారు. ఈ ఏడుగురిలో ఒకరిని ఛైర్మన్‌గా ఎన్నుకుంటారని ఆయన వెల్లడించారు.

నగరాభివృద్ధి, పరిశుభ్రతకు ప్రాధాన్యం

మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధి, పరిశుభ్రతే లక్ష్యంగా కలసికట్టుగా పని చేద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.మౌర్యతో కలసి అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత కమిషనర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రోడ్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో కార్పొరేటర్లను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. యూడీఎస్, తాగునీరు, రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు అవసరమైన నిధులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌ల దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

- ఐదేళ్లుగా అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై దృష్టిపెట్టాలని ఎమ్మెల్యే టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కపిలతీర్థం రోడ్డులోని కార్పొరేషన్ భవనంలో మెరిడియన్ హోటల్ ఏర్పాటు వెనుక అవకతకలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనివలన కపిలతీర్థం సర్కిల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నట్టు గుర్తించామన్నారు. సీఎం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లామన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారన్నారు. కమిషనర్ స్పందిస్తూ సర్వే చేసి అతిక్రమణ జరిగివుంటే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎస్‌ఈ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నడకదారిలో ఈసుర్లు

అలిపిరి నడకమార్గంలో మంగళవారం రాత్రి భారీగా ఈసుర్లు వచ్చాయి. మోకాళ్లమిట్టకు సమీపంలో లైట్ల చుట్టూ భారీగా చేరాయి. దీంతో నడక దారిన వెళుతున్న భక్తులు ఇబ్బంది పడ్డారు. చెవులు, కళ్లల్లో పడతామోనని భయంతో నడకమార్గంలో కాకుండా రోడ్డుపైనే నడిచారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి









వెరైటీగా..

వివిధ ఆకృతులు, దేవతామూర్తుల బొమ్మలతో, చూడగానే ఆకర్షించేలా మట్టి ప్రమిదలు వచ్చాయి. దీపావళి సందర్భంగా ఇలాంటి వెరైటీ ప్రమిదలను తిరుపతిలో విక్రయిస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



పారిశ్రామికాభివృద్ధిలో భాగస్వాములుకండి

- శ్రీసిటీలో పరిశ్రమల ప్రతినిధుల సమావేశంలో మంత్రి భరత్ పిలుపు

శ్రీసిటీ, అక్టోబరు 29: నూతన పారిశ్రామిక విధానంతో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రగామి పెట్టుబడుల కేంద్రంగా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంలో భాగస్వాములు కావాలంటూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పరిశ్రమల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఎస్.యువరాజ్‌తో కలిసి మంత్రి మంగళవారం శ్రీసిటీలో పర్యటించారు. తన పర్యటనలో భాగంగా ఇక్కడి పరిశ్రమల సీఈవోలు ఇతర ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పారిశ్రామిక విధానం 4.0ను వారికి వివరించారు.



శ్రీసిటీలో పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమైన మంత్రి

సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... నూతన పారిశ్రామిక విధానం ద్వారా రాబోయే ఐదేళ్లలో రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులను, 10 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా కార్యాచరణను అమలు చేస్తామన్నారు. ఈ విధానంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), ఎలక్ట్రానిక్స్ ఆహార శుద్ధి, పర్యావరణ హరిత శక్తి, ప్రైవేట్ పారిశ్రామిక పార్కులపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. సుస్థిర పారిశ్రామికాభివృద్ధిని పెపొందించుకుంటూ ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. సమావేశానికి హాజరైన వివిధ పరిశ్రమల ప్రతినిధులు నూతన పారిశ్రామిక విధానాన్ని హర్షించారు. ముఖ్యంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ప్రశంసించారు. ఎంఎస్ఎంఈలు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు ఉదేదశించిన ప్రోత్సహకాలను అభినందిస్తూ, పెండింగ్‌లో ఉన్న ప్రోత్సహకాలను ప్రభుత్వం త్వరగా రీయింబర్స్‌మెంట్ చేయాలని కోరారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల అవసరాలకనుగుణంగా వృత్తి, శిక్షణ కార్యక్రమాలలో పెట్టుబడులను పెంచాలని సూచించారు. శ్రీసిటీలో పారిశ్రామికవర్గానికి నూతన పారిశ్రామిక విధానం, దాని ముఖ్య అంశాలను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినందుకు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌డీసీగా వరకుమార్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ల్యాండ్ ప్రొటక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా వరకుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని కేఆర్‌ఆర్‌సీ విభాగంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. జిల్లా ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌డీసీగా ఉన్న రామ్‌మోహన్ తిరుపతి ఆర్డీవోగా బదిలీపై వెళ్లారు. అయితే జిల్లా ప్రొటోకాల్, వీసీబీసీ, జీఎన్ఎస్ఎస్ వంటి పోస్టులకు ఇంకా ఎవరినీ నియమించలేదు.

వైభవంగా కల్యాణ వెంకన్న పవిత్ర సమర్పణ



చంద్రగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రెండోవ రోజైన మంగళవారం పవిత్రోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, మూలవర్లకు అభిషేకం, తోమాల సేవ, కొలువు పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రాసాయనం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. పాలు, పెరుగు, తేనే, చందనం, కొబ్బరినీళ్ళతో విశేషంగా అభిషేకం చేశారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, అనం భట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, పార్థసారథి, శేషాచార్యులు నారాయణాచార్యులు, జమేధర్ చిరంజీవి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



చెంచయ్య మృతదేహానికి రీపోస్టుమార్టం!

- తిరుపతి జిల్లా వైసీపీ కార్యకర్త మృతిపై హైకోర్టు ఆదేశం
- ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ తీయించాలని నిర్దేశం

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలం, వడ్డిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త బండి చెంచయ్య మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించి, ఆ నివేదికను తమ ముందు ఉంచాలని హైకోర్టు ఆదేశించింది. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) ఆస్పత్రి వైద్యుల బృందంతో రీపోస్టుమార్టం చేయించాలని, ఆ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయించాలని, మృతుడి భార్య, రక్తసంబంధీకులను మాత్రమే లోనికి అనుమతించాలని ఆ జిల్లా ఎస్పీ, పెళ్లకూరు ఠాణా సీఐలకు సూచించింది. ఈ వ్యవహారంలో ఇతరులు ఎవరూ జోక్యం చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేయాలని నిర్దేశించింది. తన భర్త మృతిపట్ల అనుమానాలున్నాయని, రీపోస్టుమార్టం నిర్వహించాలని స్వయంగా మృతుడి భార్య కోరుతున్నందున నివృత్తి చేసేందుకే ఈ ఉత్తర్వులు ఇస్తున్నామని పేర్కొంది. రీపోస్టుమార్టం నిర్వహణ వల్ల ఎవరికీ అన్యాయం జరగబోదని, అనుమానాలు తొలగిపోతాయని తెలిపింది. విచారణను పది రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చెంచయ్య మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ చెంచయ్య భార్య ప్రమీలమ్మ వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. తన భర్తను ప్రత్యర్థులు హత్య చేశారని, చెట్టుకు ఉరివేసుకొని మరణించినట్లు చిత్రీకరించారని ప్రమీలమ్మ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చెంచయ్యను ప్రత్యర్థులు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారన్నారు. మృతుడి ఒంటిపై యాసిడ్ గాయాలు ఉన్నాయని తెలిపారు. వాస్తవాలను వెలికితీసేందుకు స్విమ్స్ వైద్యబృందం తో రీపోస్టుమార్టం చేయించాలని కోరారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి స్పందిస్తూ.. గ్రామంలో రెండు వర్గాలున్నాయని, ఘటనకు రెండు రోజుల ముందు ఇరువర్గాల మధ్య గొడవ జరిగిందని తెలిపారు. చెంచయ్య మరణాన్ని రాజకీయంగా వాడుకొనేందుకు ప్రయత్నించారని, మొదట పరిశీలించినప్పుడు మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలూ లేవని పేర్కొన్నారు. ఏ కారణంతో మృతిచెందారో తెలియాలంటే పోస్టుమార్టం రిపోర్టు రావాల్సి ఉందన్నారు.

బాలలపట్ల నేరాలను కట్టడి చేయాలి

- సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి
- ఏపీ ఎస్‌సీపీసీఆర్ ఛైర్మన్ అప్పారావు



సదస్సులో మాట్లాడుతున్న బాలల కమిషన్ చైర్మన్ అప్పారావు

తిరుపతి విద్య, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బాలలపై జరుగుతున్న నేరాలను కట్టడి చేయడానికి ఆయా శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని బాలల హక్కుల కమిషన్ (ఏపీ ఎస్‌సీపీసీఆర్) చైర్మన్ అప్పారావు పిలుపునిచ్చారు. బాలల హక్కుల కమిషన్ నేతృత్వంలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ (సీఐఎఫ్) ఆధ్వర్యంలో బాలలపట్ల జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, వేధింపులు, సైబర్ నేరాలపై తిరుపతిలో మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ముఖ్యంగా బాలలను లక్ష్యంగా చేసుకుని అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయన్నారు. అనేక సైబర్ నేరాలతోపాటు కొందరు బాలలైతే ఏకంగా సెక్సువల్ దోపిడీకి గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకొందరు బాలలను మభ్యపెట్టి, భయపెట్టి గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు అలవాటుచేసి వారిని రవాణాకు కూడా వినియోగించుకుంటున్నారంటూ ఇటీవల వెలుగుచూసిన కొన్ని సంఘటనలతో వివరించారు. వీటన్నింటినీ అరికట్టాలంటే బాలలందరికీ సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించాలన్నారు. కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. బాలలపై సైబర్ నేరాలు నిత్యకృత్యమైపోయాయన్నారు. ఫొటోలు మార్ఫింగ్ చేసి భయపెట్టడం, బెదిరించడం లాంటివి నిత్యం వినాల్సి వస్తోందన్నారు. వీటిని తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు సోషల్ మీడియాపట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలని, పటిష్టమైన పాస్‌వర్డ్ పెట్టుకోవాలన్నారు. ఆడపిల్లలు తమ ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టొద్దని సూచించారు. మొబైల్, ట్యాబ్‌లతో తమ పని అయిపోగానే నెట్ ఆఫ్ చేసేయాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలు, బెదిరింపులకు గురైతే భయపడకుండా టోల్‌ఫ్రీ నంబర్ 1930కి ఫోన్‌చేసి ఫిర్యాదుచేస్తే తక్షణం తగిన రక్షణ లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐఎఫ్ మేనేజర్ గౌరి, కోఆర్డినేటర్ కొడప్ప, సభ్యులు సుబ్రత్‌కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ తమీమ్ అహ్మద్, రాయలసీమ, నెల్లూరు జిల్లాల బాలల సంక్షేమ సమితి అధ్యక్షులు, మిషన్ వాత్సల్య అధికారులు అధికారులు, జిల్లా సైబర్ నేరాల పర్యవేక్షణ పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుపతిలో మరో 8 హోటళ్లకు బాంబు బెదిరింపు

- మైక్రో సాఫ్ట్ నుంచి వచ్చిన మెయిల్స్



గోల్డన్ దులిఫ్ హోటల్‌లో తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మరో ఎనిమిది హోటళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. మంగళవారం రాత్రి 9.30 గంటల నుంచి వరసగా ఈ హోటళ్లకు బెదిరింపు మెయిల్స్ పంపారు. ఇప్పటి వరకు బెదిరింపులే రాగా.. ఈసారి మాత్రం గ్యాస్, వాటర్ పైపులైన్లు, మురుగునీటి పైపులలో పేలుడు పదార్థాలు ఉంచామంటూ పేర్కొన్నారు. ఇలా తాజ్, బ్లిస్, మినర్వా చక్రి, పాయ్ వైస్రాయ్, రీనెస్టు, గోల్డన్ దులిఫ్, రమీ గెస్ట్‌లైన్ హోటళ్లకు మెయిల్స్ వచ్చాయి. వీటిని ఆయా హోటళ్ల యజమానులు పోలీసులకు పంపారు. డీఎస్పీ వెంకటనారాయణ పర్యవేక్షణలో అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ నాగార్జున రెడ్డి, పోలీసులు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు అన్ని హోటళ్లను తనిఖీ చేశాయి. వెయిటింగ్ రూములు, మహిళలు వున్న గదులు, వంట గదులు తనిఖీ చేశారు. అన్ని హోటళ్లలో దాదాపు రెండు గంటలపాటు జరిపిన తనిఖీల్లో ఎక్కడా పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, కొన్ని హోటళ్లలో ఉన్న విదేశీయులనూ తనిఖీ చేశారు.

8 నుంచీ ఎస్వీయూలో యువ తరంగ్

- పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి అనగాని



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీలో నవంబరు 8వ తేది నుంచి యువ తరంగ్-2024 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు చేపట్టే ఈ కార్యక్రమాన్ని వర్సిటీ కల్చరల్ అఫైర్స్ విభాగం నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మంగళవారం ఆవిష్కరించారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడా సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి యూరప్‌లో శ్రీనివాస కల్యాణాలు



కల్యాణం వివరాల క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు,సూర్య ప్రకాష్ వెలగా, కృష్ణ జవాజీ

తిరుమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నవంబరు, డిసెంబరు నెలల్లో యూకే, ఐర్లాండ్, యూరప్‌ల్లో ఎనిమిది దేశాల్లోని 13 నగరాల్లో శ్రీనివాస కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు సూర్య ప్రకాష్ వెలగా, కృష్ణ జవాజీలు మంగళవారం టీటీడీ ఈవో శ్యామలరావును తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. టీటీడీ సహకారంతో స్థానిక స్వచ్ఛంద, సాంస్కృతిక సంస్థలతో కలిసి నవంబరు 9 నుంచి డిసెంబరు 21 వరకు ఏపీ ఎన్ఆర్‌టీ శ్రీనివాస కల్యాణం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఈవోకు తెలిపారు. ఈ తిరు కల్యాణ కార్యక్రమాల్లో టీటీడీ వేదపండితులు వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించనున్నారు. నవంబరు9న బెల్ఫాస్ట్(ఐర్లాండ్), 10న డబ్లిన్(ఐర్లాండ్), యూకేలో 16న బేసింగ్‌స్టోక్(యూకే), 17న ఐండోహోవెన్(నెదర్లాండ్స్), 23న హాంబర్గ్(జర్మనీ), 24న పారిస్(ఫ్రాన్స్), 30న వార్సా(పోలాండ్), డిసెంబరు1న స్టాక్‌హోం(స్వీడన్), 7న మిల్టన్‌కీన్స్(యూకే), 8న గ్లొసెస్టర్(యూకే), 14న ఫ్రాంక్‌ఫర్ట్(జర్మనీ), 15న బెర్లిన్(జర్మనీ), 21న జ్యూరిచ్(స్విట్జర్లాండ్)లో కల్యాణం నిర్వహించనున్నారు.

భక్తులకు టీటీడీ ఈవో దీపావళి శుభాకాంక్షలు

శ్రీవారి భక్తులకు టీటీడీ ఈవో శ్యామలరావు మంగళవారం ఒక ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

ఏమార్చి.. నగలు కాజేసి!

- ఇద్దరు నిందితుల అరెస్టు
- రూ.3.6 లక్షల విలువైన బంగారు నగలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలను ఏమార్చి, బ్యాగుల్లోని బంగారు నగలు, సెల్‌ఫోన్లు అపహరించే ఇద్దరు నిందితులను తిరుపతి క్రైం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. డీఎస్పీ రమణకుమార్ తెలిపిన ప్రకారం.. కృష్ణా జిల్లా గుడివాడ మండలానికి చెందిన వేముల శివకుమార్ వృత్తిరీత్యా తిరుపతి రూరల్ మండలం తనపల్లి వద్ద ఉంటున్నాడు. ఇతడితో పాటు వేములపల్లి దుర్గ ఉంటోంది. ఈజీ మనీ కోసం వీరు దొంగతనాలకు అలవాటు పడ్డారు. వారి సహచరులు దుర్గాప్రసాద్, జగదీష్‌తో కలసి గుడివాడ, భీమవరం, ఆకివీడు, నిడదవోలు, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో 30కి పైగా ఇంటి దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ కేసుల్లో జైలుకు వెళ్లొచ్చారు. ఇందులో దుర్గ పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దేవాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల వద్ద విలువైన బంగారు నగలు, సెల్‌ఫోన్లను వారి బ్యాగుల నుంచి దొంగిలించి పారిపోవడంలో ఆరితేరిన వారుగా పోలీసులు గుర్తించారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో జరిగిన దొంగతనం కేసుల్లో దర్యాప్తు జరిపిన క్రైం పోలీసులు వీరికోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం అలిపిరి బస్టాండు వద్ద ఇద్దరు నిందితులు ఉండగా క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3.60 లక్షల విలువైన బంగారు నగలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ రమణకుమార్ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందికి రివార్డుల కోసం ప్రతిపాదనలు పంపుతున్నట్లు చెప్పారు.

1 నుంచి ఏపీఆర్‌సెట్ రెండో దశ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఆర్‌సెట్) రెండో దశ అడ్మిషన్లు చేపట్టనున్నారు. 2,566 సీట్లకుగాను, తొలి దశలో 2005 సీట్లు భర్తీ చేశారు. మిగిలిన సీట్లను రెండో దశలో భర్తీ చేయనున్నారు. సమగ్ర సమాచారం కోసం.. సెట్స్ఏపీసీహెచ్ఈ.ఏపీ.జీవోవీ వెబ్‌సైట్ చూడాలని ఏపీఆర్‌సెట్-2024 కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు సూచించారు.

ఎస్వీబీసీకి రూ.54.47 లక్షల విరాళం

తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీబీసీ (శ్రీవేంకటేశ్వర భక్తి చానల్) ట్రస్టుకు మంగళవారం రూ.54.47 లక్షలు విరాళంగా అందింది. యూనియన్ బ్యాంక్ ఎండీ మణిమేఖలై ఈ విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈమొత్తాన్ని ఎస్వీబీసీ ట్రస్టుకు వినియోగించాలని కోరారు. జోనల్ హెడ్ భాస్కర్‌రావు, రిజినల్ హెడ్ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న మణిమేఖలై

మాజీ మంత్రి పరసారత్నంకు పరామర్శ



శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరసారత్నంను జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే సుధీర్ పరామర్శించారు. పరసారత్నం అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది తిరుపతిలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. మంగళవారం ఆయన్ను వారు పరామర్శించారు.

విద్యా దీవెన బిల్లులను విడుదల చేయాలి: ఎస్‌ఎఫ్‌ఐ



శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన బిల్లులను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. విద్యా, వసతిదీవెన బిల్లులు మంజూరు కాకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు.

మహిళలపై దాడులను నియంత్రించండి

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, హత్యలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షురాలు భారతి అన్నారు. జాతీయ కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. పశ్చిమబెంగాల్, కేరళ, ఉత్తరప్రదేశ్‌లలో మహిళలపై అత్యాచారాలు జరిగిన తీరు ఆందోళనకు కలిగిస్తోంద న్నారు. చట్టాలను కఠినంగా అమలు చేసి నేరాలను నియంత్రించాలని కోరారు. స్వర్ణ, శోభ, కల్పన శాంతకుమారి, మణిశ్రీ, స్వరాజ్, సురేఖ, లక్ష్మి, మోహనరాణి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కాలభైరవ స్వామి ప్రాకారోత్సవం



శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న కాల భైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళతాళాల మధ్య అభిషేకాలు, ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవమూర్తిని మహాద్వారం నుంచి విజయ స్తూపం వరకు ప్రదక్షిణగా తీసుకెళ్లి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు. అలాగే పదహారు కాళ్ల మండపంలో కొలువై ఉన్న ఆంజనేయుడిని వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు స మర్పించారు. అనంతరం సిందూరం దిద్ది పు ష్పాలతో అలంకరించారు. భక్తులు తమల పాకుల మాలలు సమర్పించారు. అదే విధంగా సత్యసాయిబాబా గుడి వీధిలో ఉన్న అంజనేయస్వామికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు నిర్మాణంపై రగడ

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సిమెంటు రోడ్డు నిర్మించే విషయంలో వాగ్వాదం జరిగింది. ఈ ఘటన తొట్టంబేడు మండలం కల్లిపూడి గ్రామంలో మంగళవారం జరిగింది. కల్లిపూడికి చెందిన ఓ వర్గం సిమెంటురోడ్డు నిర్మాణానికి ఇటీవల ప్రతిపాదనలు చేశారు.అయితే తమ ఇంటి ముందు బాగున్న రోడ్డుపై మళ్లీ రోడ్డు వేస్తే వర్షాకాలంలో ఇంట్లోకి నీరు వస్తుందని మరో వర్గం వ్యతిరేకించింది. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రోడ్డు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న తల్లీకొడుకులు పోలమ్మ(70), నాగూరయ్య(45)పై అవతలివర్గం వారు కర్రలతో దాడి చేసి గాయపరిచారు. క్షతగాత్రులు చికిత్సనిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియాఆస్పత్రిలోచేరారు. తొట్టంబేడుపోలీసులు దాడి ఘటనపై విచారణ చేస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో నేలకు జీవం

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులు వ్యవసాయ భూములకు జవజీవాలిస్తాయని వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. తొట్టంబేడు మండలం మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. జీవామృతం భూమిలో సేంద్రియ పదార్థాన్ని పెంచుతుందన్నారు. వ్యవసాయ అధికారుల సలహాతోనే రసాయన మందులను వినియోగించాలన్నారు. పురుగు మందుల వాడకాన్ని తగ్గించి యాజమాన్య పద్ధతులతో చీడపీడలను అదుపులో పెట్టవచ్చన్నారు. ఏడీఏ రమేష్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాలరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మల్లికార్జున, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణ పనుల తనిఖీ



ఏర్పేడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిబాక పంచాయతీ ఆది ఆంధ్రవాడలో జరుగుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తనిఖీ చేశారు. మండలంలో రూ.2కోట్లతో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలను నిర్మిస్తామన్నారు. అదనపు కార్యక్రమాధికారి చంద్రశేఖర్‌రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వినోద్‌కుమార్, మాజీ సర్పంచు ఆర్.మల్లికార్జున్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మడిబాక పంచాయతీ అరుంధతివాడలో ఉపాధి హామీ నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని టీడీపీ నేత, మాజీ సర్పంచు ఆర్.మల్లికార్జుననాయుడు ఆధ్వర్యంలో చేపట్టారు. సుమారు 120 మీటర్ల మేర రోడ్డును రూ.4లక్షలతో నిర్మించనున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పదిమందికి జరిమానా

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన పదిమంది వాహనదారులకు కోర్టు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించింది. శ్రీకాళహస్తి పట్టణలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి మద్యం తాగి పదిమంది వాహనాలు నడుపుతుండగా 1వ పట్టణ పోలీసులు వారిపై కేసులు నమోదు చేశారు. వారిని మంగళవారం కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. అదే విధంగా 22మందిపై న్యూసెన్సు కేసు కింద రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

దోపిడీ కేసులో నలుగురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ

రేణిగుంట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కర్మాగార ఉద్యోగిపై దాడి చేసి అతని సెల్‌ఫోన్, నగదు దోపిడీ చేసిన ఘటనలో నలుగురు నింది తులను గాజులమండ్యం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు... ఆదివారం తెల్లవారు జామున గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆటో ఎక్కిన ప్రయాణి కుడిని రేణిగుంట సమీపంలోని జ్యోతినగర్ వద్ద నలుగురు దోచుకున్న విషయం విదితమేనన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా రైల్వే పార్కింగ్ వద్ద ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. రేణిగుంట వడిమిట్ట చెందిన దిలీప్, వడమాలపేట మండలం వెంగ్రాజు కండ్రిగకు చెందిన గుణశేఖర్ సహా ఇద్దరు మైనర్లను అరెస్టు చేసి, ఆటోను సీజ్ చేశామని తెలిపారు. వీరిని కోర్టుకు తరలించగా ఇద్దరి 14 రోజుల రి మాండ్ విధించిందన్నారు. ఇద్దరు మైనర్లను జువైనల్‌హోంకు తరలించామని చెప్పారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ సుధాకర్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నారాయణ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. బుచ్చినాయుడుకండ్రిగ మండలం జోగికండ్రిగకు చెందిన కొప్పుల నారాయణ(25) తొట్టంబేడు మండలం రౌతు సూరమాల సమీపంలోని ప్రైవేటు కర్మాగార ఉద్యోగి. పెళ్లకూరు మండలం నెలబల్లి దళితవాడకు చెందిన సమీరాతో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాది కొడుకు ఉన్నాడు. ఇటీవల భార్య సమీర కొడుకుతో నెలబల్లిలోని అమ్మగారింటికి వెళ్లింది. ఆమెను చూసేందుకు రెండు రోజుల క్రితం నారాయణ వెళ్లాడు. సోమవారం సాయంత్రం తొట్టంబేడు మండలంలోని తాటిపర్తిలో ఉన్న మేనత్త ఇంటికి వచ్చాడు. అనంతరం తిరిగి ద్విచక్ర వాహనంపై భార్య వద్దకు వెళ్తుండగా మార్గమధ్యంలో రామానాయుడు ఎస్టీకాలనీ వద్ద రోడ్డు పక్కన ముళ్లపొదలో పడి మృతి చెందాడు. అర్ధరాత్రి అవుతున్నా ఇంటికి చేరుకోకపోవడంతో బంధువులు గాలించారు. ఉదయం ముళ్లపొదల్లో విగతజీవిగా పడి ఉన్నట్లు స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. తొట్టంబేడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

పుత్తూరు వార్తలు

కంటైనర్ లారీ ఢీకొని చిరువ్యాపారి దుర్మరణం

పుత్తూరు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కంటైనర్ లారీ ఢీకొని నవారా వ్యాపారి దుర్మరణం చెందాడు. ఎస్ఐ ఓబయ్య తెలిపిన వివరాలు... పల్నాడు జిల్లా పెద్ద కూరపాడు మండలం పొడపాడుకు చెందిన యాసిన్(60) మంచం నవారు విక్రయిస్తుంటారు. మంగళవారం ఉదయం రేణిగుంట నుంచి నవారుతో బైక్‌పై పుత్తూరుకు వస్తుండగా తడుకు ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలో హరియాణానుంచి చెన్నై వెళ్తున్న కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో యాసిన్ సంఘటనా స్థలంలో దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మొరాయించిన రైల్వే గేటు

పుత్తూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వాహనాల రాకపోకలకు తరచూ ఇబ్బంది పెట్టే నారాయణవనం రైల్వే గేటు మంగళవారం మళ్లీ మొరాయించింది. దీంతో గేటు మరమ్మతుల కోసం ఉదయం నుంచి మూసి వేశారు. సత్యవేడు, రెడ్‌హిల్స్ మీదుగా చెన్నై వెళ్లే వాహనాలు మూడు కిలోమీటర్లు చుట్టి రాకపోకలు సాగించాయి. నారాయణవనం గేటు అవతల ఉన్న వారిదీ ఇదే పరిస్థితి. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు గేటుకు ఆపక్క నిలిచి ఉన్న ఆటోలను ఆశ్రయించారు. కాగా శాశ్వత పరిష్కార దిశగా పెండింగ్‌లో వున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంది.

విద్యా, వసతి దీవెన బకాయిలు చెల్లించండి: ఎస్‌ఎఫ్‌ఐ

పుత్తూరు టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. అలాగే డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 77ను రద్దు చేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వెంకటేష్, ముకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురులకు అడ్డుకట్ట

ఏర్పేడు, అక్టోబరు 29: మండలంలోని కోబాక స్వర్ణముఖి నుంచి రాత్రి వేళ్లల్లో ఇసుకను బయట ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న తహసీల్దారు భార్గవి మంగళవారం ఇసుక తరలించే మార్గంలో కందకం తవ్వించారు.

తెలుగు భాషా సాహితీ క్రీడ అవధానం

● శతావధాని ఆముదాల మురళి



అష్టావధానం జరుగుతున్న దృశ్యం

బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా సాహితి క్రీడ అవధానమని శతావధాని ఆముదాల మురళి అన్నారు. మండంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో యువశ్రీ మురళి ఆధ్వర్యంలో శతావధాని ఆముదాల మురళి అష్టావధానం జరిగింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన అవధానంలో పృచ్ఛకుడు, నిషిద్ధాక్షరి- గండుపల్లి గోవిందయ్య, సమస్య- చిన్నయ్యర్రయ్య, దత్తపది- యువశ్రీ మురళి, వర్ణన- పేరూరు బాలసుబ్రమణ్యం, పురాణ పఠనం డాక్టర్ యడవల్లి పరమేశ్వరయ్య, న్యస్తాక్షరి- డాక్టర్ నెమిలేటి కిట్టన్న, ఆశువు- ఏడు కొండలయ్య, అప్రస్తుత ప్రసంగం- డాక్టర్ రంగయ్య వ్యవహరించారు. వారు అడిగిన ప్రశ్నలకు అవధాని పద్యాలతో సమాధానాలను పూరించారు. అంతకుముందు పలువురు వక్తలు ప్రసంగించారు. పిల్లలోని భాషా సామర్థ్యాలను వెలికి తీసి సృజనాత్మకంగా ఆలోచించేలా చేయడంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి కృషి చేయాలని బాల సాహితీ వేత్త కృష్ణస్వామిరాజు కోరారు. నేటి పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేలా కథల పుస్తకాలు చదివించాల్సి ఉందన్నారు. అనంతరం అవధాని మురళి తదితరులకు జైతెలుగు తల్లి జ్ఞాపిక, శాలువ, పుస్తకాలతో సత్కరించారు. ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రూపేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో నిలుద్దాం

టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్



సభ్యత్వ నమోదులో విజయకుమార్ తదితరులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచే విధంగా కృషి చేద్దామని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయ కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా జరుగుతోంది. రూ.100తో సభ్యత్వం తీసుకుంటే కుటుంబలో ఎవరైనా ప్రమాదంలో మృతి చెందితే వారికి రూ.5లక్షలు వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని విజయకుమార్ చెప్పారు. కంఠా రమేష్, రాము, ఎం.రవి, హేమంత్ కుమార్, సుబ్బయ్య, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



ఏర్పేడు, అక్టోబరు, 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. రూ.100 చెల్లించి సభ్యత్వం స్వీకరించారు. సుమారు 500మంది సభ్యత్వం తీసుకున్నట్టు నాయకులు చెప్పారు. విజయకుమార్, రమేష్‌గుప్తా, సుబ్రహ్మణ్యంరెడ్డి, తంబా మురగప్ప, సీతాపతి ఆచారి, మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి రాట్నం బహూకరణ



వరదయ్యపాళెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మంగళవారం జాతీయ దేవాంగ, చేనేత నాయకుడు గుత్తి త్యాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు చేనేత చిహ్నంగా రాట్నం అందజేశారు. నియోజకవర్గం సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే సుధీర్



శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన రెవె న్యూ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ మం గళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన తో పాటు ఎమ్మెల్యే సుధీర్ కూడా వెళ్లి స్వామివారి సేవలో పాల్గొన్నారు.

వాటర్ క్యాన్ల వితరణ



వరదయ్యపాళెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు బీజేపీ, జనసేన నాయకులు వాటర్ క్యాన్లు, గ్లాసులను అందజేశారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేవీ గురుదేవ్, విక్కీ తమ సొంత నిధులతో 65 వాటర్ క్యాన్లు, స్టీలు గ్లాసులు అందజేశారు. పురుషోత్తం, డిల్లీప్రకాష్, జనసేన నాయకులు తడ శ్రీనివాసులు, ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అవంతి పరిశ్రమను సందర్శించిన లిడ్‌క్యాప్ చైర్మన్



లెదర్‌ను పరిశీలిస్తున్న పిల్లి మాణిక్యాలరావు

వరదయ్యపాళెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలో సుమారు 85 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన అవంతి లెదర్ పరిశ్రమను మంగళవారం లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు సందర్శించారు. పరిశ్రమలో తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఉపాధిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎండీ దనేకుల వాసుదేవరావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.











